క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోవాలి



భీమవరంలో ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ నర్సింహారావు

ఎర్రుపాలెం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని భీమవరం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని వారు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారమే సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శీలం శ్రీనివాసరెడ్డి, యరమల పూర్ణచంద్రారెడ్డి, అనుమోలు కృష్ణారావు, గుర్రాల శ్రీనివాసరెడ్డి, గుడేటి బాబురావు, తదితరులున్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణా శిబిరం

కల్లూరు: కల్లూరు మినీ స్టేడియం వద్ద సోమవారం నుంచి ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు క్రీడల్లో వేసవి శిక్షణా శిబిరం ప్రారంభమవుతుందని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్న పిల్లలకు ప్లేయింగ్, మూడు నుంచి పై తరగతులు చదువుతున్న విద్యార్థులకు తమకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఖమ్మం జిల్లా యువజన మరియు క్రీడల అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించబడుతుందన్నారు. శిక్షణా శిబిరంలో ఇండోర్ షటిల్ బ్యాట్మింటన్, అవుట్‌డోర్ వాలీబాల్, అవుట్‌డోర్ అథ్లెటిక్స్, ఇండోర్ కబడ్డీలలో శిక్షణ ఇచ్చి వారిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని పెంచడం జరుగుతుందన్నారు. శిక్షణా శిబిరం పర్యవేక్షకులుగా పీఈటీ పసుపులేటి వీర రాఘవయ్య వ్యవహరించనున్నారు.

అలుపెరగని పోరాట యోధురాలు దుర్గాదేవి



దుర్గాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

కారేపల్లి: మహిళా సమస్యలపై కొండపల్లి దుర్గాదేవి అలుపెరగని పోరాటం చేశారని ఐద్వా కారేపల్లి మండల ప్రధాన కార్యదర్శి కె.ఉమావతి అన్నారు. ఆదివారం కారేపల్లిలో అమరజీవి దుర్గాదేవి 3వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, సాయుధ పోరాట యోధుడు కేఎల్ నరసింహారావు సతీమణిగా అండదండగా ఉంటూ ఐద్వా ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు ఇదిగాని శారద, చిత్తారు రమాదేవి, మేకల మౌనిక, రమ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో చోరీ

వేంసూరు: మండలంలోని కందుకూరులో నివాసముంటున్న ఉన్నం సునీల్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. సునీల్ తన ఇంటి భవనంపై పడుకోగా.. దొంగలు ఇంట్లో చొరబడి 30గ్రాముల బంగారం రూ.2000 నగదు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై వీరప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నెరవేరని లక్ష్యం..

- పేరుకే నర్సరీలు..
- నగం నాటని హరితహారం మొక్కలు
- మానులై పెరుగుతున్న వైనం..
- పట్టించుకోని అధికారులు



గంధసిరి నర్సరీలో ఎత్తుగా పెరిగిన మొక్కలు

ముదిగొండ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహార పథకం లక్ష్యాన్ని చేరడం లేదు. ప్రతి ఏటా రూ.లక్షల్లో ఖర్చుపెడుతున్నా ఫలితం దక్కడంలేదు. దీంతో మొక్కల లక్ష్యం నెరవేరడం లేదు. కొందరి నిర్లక్ష్యం వల్ల లక్ష్యం అబాసుపాలయిపోతుందని వాపోతున్నారు. మండలస్థాయి అధికారులు నిర్లక్ష్యం ఫలితంగా ముదిగొండ మండలంలోని డ్వామా, సామాజిక అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో సగానికిపైగా మొక్కలు అడవిని తలపించేలా ఎత్తుగా పెరిగిపోయాయి. ఈ నర్సరీల్లోని మొక్కలు వేర్లు భూమిలోకి వెళ్లిపోవడంతో ప్రస్తుతం వేసేందుకు అనువుగా లేవు.

రైతులకు ఉపయోగపడని మొక్కలు..

నర్సరీలను ఏర్పాటు చేసే సమయంలో అధికారులు నిర్లక్ష్యపు దోరణితో వ్యవహరించడంతో రైతులకు ఉపయోగపడని వేల మొక్కలు నర్సరీల్లో పెంచారు. దీంతో రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మొక్కలు నర్సరీల్లో సగానికిపైగా మొక్కలను తీసుకెళ్లేందుకు రైతులు విముఖత చూపుతున్నారు.

మండలంలోని 25 పంచాయతీల్లో..

ముదిగొండ మండల టార్గెట్ 1,09,000 ఒక్కో గ్రామ పంచాయతీ టార్గెట్ 10వేలు.. మండలంలో 25 పంచాయతీల్లో ఉన్న నర్సరీల్లో 65,000 మొక్కలు ఉపాధిహామీ పనుల్లో భాగంగా పెంచగా.. వాటిలో ఐదురకాలు మొక్కలు నిరుపయోగంగా ఉన్నాయి.

సంరక్షించాలి..



ప్రతి గ్రామంలో నర్సరీలు ఉన్నాయి, కాని వాటిల్లో సరైన పెంపకం లేకపోవడం, పూర్తిగా నాటలేకపోవడంతో చాలా మొక్కలు వృథా అవుతున్నాయి. ప్రతి ఏడాది నాటిన మొక్కలు ఒక్కటి కూడా సరైన పోషణ లేక ఎండిపోతున్నాయి. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. – రాయల శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్, వెంకటాపురం

సూచనలు చేస్తున్నాం..



అన్ని జీపీల్లో పంచాయతీ కార్యదర్శులకు హరితహారం మొక్కలపై అవగాహన కల్పించి, సూచనలు చేస్తున్నాం. వాటిని రక్షించే బాధ్యత కూడా సిబ్బందిదే. ఎక్కడా మొక్కలు ఎండిపోకుండా చూస్తున్నాం. షేడ్‌నెట్‌లు అమర్చాం. మొక్కలు ఎండి పోకుండా ట్యాంకుల ద్వారా నీటిని పెడుతున్నారు. ఎత్తుగా పెరిగిన మొక్కలు రోడ్ల వెంట నాటించాల్సి ఉంది. – శ్రీధర్‌స్వామి, ఎంపీడీఓ ముదిగొండ

దీంతో లక్షల ప్రజాధనం దుర్వినియోగం అయింది. గతంలో రూ.16 లక్షలతో 6.5 లక్షల మొక్కలను ఖాళీ ప్రదేశాల్లో పెంచగా.. అధికారుల నిర్లక్ష్యంతో అవి చనిపోయాయి. నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయే తప్ప, వాటిని గ్రామాల్లో సరైన పద్ధతిలో నాటి రక్షించాలనే లక్ష్యం నెరవేరడంలేదు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



లింగాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

కల్లూరురూరల్: ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కల్లూరు మండలంలోని లింగాల గ్రామంలో ఆదివారం రాత్రి బీఆర్‌ఎస్ నాయకుడు దేవరపల్లి పట్టాభి గృహంలో శుభకార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా.. గ్రామంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ఇటీవల వచ్చిన అకాల వర్షాలు, గాలిదుమారాలకు కల్లాల్లో వేసిన ధాన్యం తడిసిపోయి, మామిడి తోటల్లో కాయిలు రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయినప్పటికీ ఆదుకున్న వారు లేకపోవడం శోచనీయమన్నారు. పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ.20 వేలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మార్చి 31కల్లా రైతు రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ మాఫీ కాలేదన్నారు. ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతోకాలం మోసం చేయదని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం లేని లోటు ఇప్పుడు ప్రభుత్వానికి అర్థం మవుతుందన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూధన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, హరిప్రియ నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు రామారావు, నాగప్రసాద్, నాగప్రసాద్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న నరేష్

చింతకాని: గ్రామాల్లో గ్రామీణ వైద్యులు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నరేష్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పందిళ్లపల్లిలో నిర్వహించిన ఆ సంఘం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి గ్రామీణ వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి, వారికి గుర్తింపును కల్పించేందుకు ప్రయత్నించటం జరిగిందన్నారు. గ్రామీణ వైద్యుల సేవలను ప్రభుత్వం గుర్తించి.. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అలాగే అర్హత కలిగిన గ్రామీణ వైద్యులకు పింఛన్, ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలని కోరారు. గ్రామీణ వైద్యులు ముందుగా ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఈ మహాసభలో తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి నర్సింహారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వట్టికూటి సైదులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పరికపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నారపు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు మర్రి నరేష్, జిల్లా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపాన్ని తీర్చే రాతి నీటి క్వారీ..



పొలాల మధ్యలో ఉన్న రాతి నీటి కొలను

ముదిగొండ: మండలంలోని బాణాపురం – వల్లబి బీటీ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ రాతి క్వారీలో నీరు కలకలాడుతోంది. ప్రతి ఏటా మండుటెండల్లో కూడా ఈ రాతి నీటి క్వారీ ఎండిపోదు. వ్యవసాయ పొలాలకు మధ్యన ఉన్న నీటి కొలను పశువులకు, జీవాలకు దాహం తీర్చడానికి ఉపయోగకరంగా ఉంది. వరి పొలాలకు నీరు పెట్టిన తరువాత ఆ పొలాల నుంచి ఊట రూపంలో వచ్చిన నీరు రాతి కొలనులో చేరడంతో ఎల్లప్పుడు నీటితో నిండి ఉంటుంది. దీంతో ఎంత ఎండలకైనా, పశుపక్షాదులకు సైతం దాహం తీర్చుతోంది.

ఏపీ సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు దోమందుల సామేలు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గురిజాల సత్యనారాయణ, గూడూరు వెంకటేశ్వరరెడ్డి జవాజి భాస్కరరావు, వాసిరెడ్డి శివకుమారి, వేముల వెంకటేశ్వరరావు, రాజా వెంకటేశ్వర్లు, ఎస్ లాల్ అహ్మద్, మస్తాన్, శీలం నాగిరెడ్డి, కొర్లపాటి శ్రీనివాసరావు, నాని, వరికూటి రవికుమార్ తదితరులున్నారు. బీటీ రహదారి పక్కనే పొలాల మధ్యన ఉన్న రాతి నీటి కొలను

వేసవిలో పేషెంట్లు జాగ్రత్తగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు భారవి, నాగేశ్వరరావు

వైరా: వేసవిలో బీపీ, షుగర్ పేషెంట్లు జాగ్రత్తగా ఉండాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు తెలిపారు. సీపీఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా 3వ ఆదివారం నిర్వహించే బోడేపూడి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 118 నెలలుగా వైరాలో వైద్యశిబిరం నిర్వహిస్తూ బీపీ, షుగర్ పేషెంట్లకు మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. వేసవిలో ప్రతిరోజూ వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోడేపూడి వైద్య శిబిరం బాధ్యులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, సుంకర సుధాకర్, చింతనిప్ప చలపతిరావు, బొంతు సమత, గుడిమెట్ల రజిత, అనుమోలు రామారావు, గుడిమెట్ల మోహన్‌రావు, మాదినేని రజని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



తల్లాడ: లూర్ధుమాతా ఆలయంలో వాక్యోపదేశం చేస్తున్న ఫాదర్ అజయ్

ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆర్‌సీఎం, సీఎస్ఐ, గుడ్ షెఫర్ తదితర చర్చిల్లో వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. ప్రభువు మూడోరోజున లేచిన సమాధుల వద్ద కొవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏసు క్రీస్తు మరణాన్ని జయించాడని, సమాధి ఆయనను శాశ్వతంగా భందించలేక పోయిందని క్రైస్తవ మత పెద్దలు వివరించారు. అర్కెస్ట్రా, వాయిద్యాలతో కూడిన గీతాలాపనలు అలరించాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి బైబిల్‌మిషన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కల్లూరురూరల్: పెద్దకోరుకొండిలో..



సత్తుపల్లిరూరల్: రేజర్ల బిలీవర్స్ చర్చిలో..

మధిరలో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

మధిర: ఈ నెల 21న మధిరలోని రెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సారథ్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, తహసీల్దార్ రాంబాబు, సీఐ మధు తెలిపారు. ఇందుకు అనుగుణంగా చేసిన ఏర్పాట్లను ఆదివారం అధికారులు పరిశీలించి మాట్లాడారు. ఈ జాబ్‌మేళాను డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారని, హైదరాబాద్ నుంచి 80 ప్రైవేట్ కంపెనీలు రానున్నాయని తెలిపారు. ఈ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థుల విద్యార్హతలను బట్టి ఇంటర్వ్యూ నిర్వహించి తగిన ఉద్యోగాలకు ఎంపిక చేసి, నియామకపత్రాలు అందిస్తారన్నారు. అభ్యర్థుల పేరు నమోదు కోసం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కోనా ధనికుమార్, అనీల్ కుమార్, నెహ్రూ తదితరులు ఉన్నారు.

వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలి



బోనకల్: నిరసన తెలుపుతున్న సీపీఎం, ముస్లిం సంఘ నాయకులు



తల్లాడ: ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

తల్లాడ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని తల్లాడలో ఆదివారం అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ముస్లిం మైనార్టీలు నల్ల బ్యాడ్జీలు దరించి నిరసన ప్రదర్శన చేశారు. నల్లచట్టాలతో కేంద్రం ప్రజల ఆస్తులను దొచుకుంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాయల రాము, తుమ్మలపల్లి రమేష్, నాయకులు డి.వెంకట్‌లాల్, శీలం సత్యనారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వరావు, ముస్లిం మైనార్టీనాయుకులు షేక్.మస్తాన్, షేక్.ఈసూఫ్, మెహరాజ్, మూకర ప్రసాద్, పాషా, అక్బర్, ఖాజామియా, నాగుల్‌మీరా, అజిత, నిజాం, సలీం, సిలార్, సైదా పాల్గొన్నారు.

బోనకల్: వక్ఫ్‌బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా మండల కేంద్రంలోని బోసుబొమ్మ సెంటర్‌లో సీపీఎం నాయకులు, ముస్లింలు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించడం ద్వారా బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ బావాలు బయటపడ్డాయన్నారు. పూర్వం ముస్లిం రాజులు ముస్లింల యొక్క సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వారి భవిష్యత్ తరాల కోసం కొన్ని ఆస్తులను కేటాయించిందన్నారు. అటువంటి ఆస్తులపై కేంద్రప్రభుత్వానికి ఎటువంటి హక్కు లేదన్నారు. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చింతల చెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, జొన్నలగడ్డ సునీత, పిల్లలమర్రి అప్పారావు, గుగులోతు నరేష్, కందికొండ శ్రీను, ఉప్పర శ్రీను, తెల్లాకుల శ్రీను, ముస్లీం నాయకులు ఎస్‌కే మౌలాలి, ఎస్‌కే షిలార్, ఎస్‌కే బాబు, ఎస్‌కే మదార్‌సాహెబ్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా !



సత్తుపల్లి పట్టణంలో బైపాస్‌రోడ్‌లో దూసుకొస్తున్న మట్టి టిప్పర్లు

- ఇరుకురోడ్లపై దూసుకెళ్తున్న టిప్పర్లు
- పట్టించుకోని అధికారులు
- అడ్డుకున్న వారిపై బెదిరింపులకు పాల్పడుతున్న డ్రైవర్లు

సత్తుపల్లిరూరల్: మట్టి కాసులు కురిపిస్తుండటంతో మట్టి మాఫియా మరింత రెచ్చిపోతుంది. సత్తుపల్లి పట్టణంలో అనుమతి లేకుండా మట్టి టిప్పర్లు రోడ్లపై వేగంగా దూసుకుపోతుండటంతో ప్రశ్నించిన వారిని డ్రైవర్లు ఇష్టం వచ్చినట్లు బూతులు తుడుతున్నారని వాపోతున్నారు. ఇది మీ రోడ్డా.. దీనిపై తిరిగే హక్కుమాకు ఉంది.. అంటూ ద్విచక్ర వాహనదారులు, కాలినడక వెళ్లేవారిపై దురుసుగా వ్యవహరిస్తున్నారు. మట్టి టిప్పర్లకు పట్టణంలో రహదారులపై తిరిగే హక్కు ఉందంటూ మీ ఇష్టం వచ్చిన వారితో చెప్పుకోండి అంటూ బెదిరిస్తున్నారు. ప్రధాన రహదారులపై తిరిగే పెద్దపెద్ద వాహనాలు మట్టి టిప్పర్లు ఇరుకు సందుల్లో సైతం వేగంగా తిరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు కల్పించుకొని మట్టి టిప్పర్లను పట్టణంలోని రహదారులపై తిరగకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు. మాకు వారి అండగా ఉంది.. వీరి అండ ఉంది అంటూ ఫోజులు కొడుతూ కూడలి ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నా.. మట్టి టిప్పర్ల డ్రైవర్లు సైతం బదిరింపులకు పాల్పడుతుండటం చర్చానీయాంశంగా మారింది. ఎన్టీఆర్‌నగర్ నుంచి కొత్తూరు వెళ్లే రహదారిపై మట్టి టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గతంలో చోటు చేసుకుంది.

పోషణ పక్షం.. ఆరోగ్యమే లక్ష్యం

- రేపటితో ముగియనున్న 'పోషణ్ పక్వాడ్'
- అంగన్‌వాడీ కేంద్రాల్లో విస్తృతంగా అవగాహన



ఆహార పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ ఉద్యోగులు (ఫైల్)

సత్తుపల్లిటౌన్: పోషకాహార లోపం చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.. ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల్లో ఎక్కువ శాతం పౌష్టికాహారలోపంతోనే ఉన్నాయని యూనిసెఫ్ పేర్కొంటోంది. సరైన పోషకాలు అందక, రక్తహీనత, ఇతర రోగాల బారినపడే ఆస్కారం ఉంటుందని పేర్కొంది. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవటం ద్వారా ఆరోగ్య తెలంగాణ లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పోషణ పక్వాడ్ కార్యక్రమాలు చేపట్టింది.

ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేలా..

జిల్లాలోని 1840 అంగన్‌వాడీ కేంద్రాల్లో పదిహేను రోజుల పాటు రోజుకు ఒక కార్యక్రమం చొప్పున నిర్వహిస్తున్నారు. మహిళ గర్భందాల్చిన తర్వాత, కాన్పు అనంతరం తల్లి, శిశువు ఆరోగ్య సమరక్షణపై అవగాహన పెంపొందిస్తున్నారు. ముఖ్యంగా తల్లుల బరువు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. దీంతో పాటు పోషకాహారం, వ్యాధినిరోధక టీకాల ఆవశ్యకతను వివరిస్తున్నారు.

జీవన శైలి మార్పు కోసం..

ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖల సమన్వయంతో గర్భిణులు, బాలింతల జీవన శైలిలో మార్పు కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లబ్ధిదారుల గృహ సందర్శన చేపట్టడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో కూరగాయల పెంపకం, సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నారు. క్రీడా పోటీలు నిర్వహించి యోగా సాధనపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధతో..



పోషణ లోపం లేకుండా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధచూపిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. గర్భిణులు పోషకాలు ఉన్న ఆహారం, గుడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే మధ్యాహ్న భోజనం తినాలి. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి.

– కనకదుర్గ, ఐసీడీఎస్ సీడీపీఓ, సత్తుపల్లి